## కర్ణాటకలో మిర్చి రైతుల కన్నెర్ర

**హవేరీ జిల్లాలో మార్కెట్ కమిటీ భవనంపై రాళ్ల దాడి**

**ఫైర్ ఇంజిన్ సహా.. మూడు వాహనాలకు నిప్పు**

బెంగళూరు, మార్చి 11: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో మిర్చి రైతులు రోడ్డెక్కారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో మిర్చి పంట కొనుగోలు ధరలు గణనీయంగా పడిపోవటంతో సోమవారం హవేరీ జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఇక్కడి బ్యాదాగి ప్రాంతంలోని ఏపీఎంసీ (మార్కెట్ కమిటీ) భవనంపై కొంతమంది రైతులు రాళ్లదాడి చేశారు. కార్యాలయంలోకి వెళ్లి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఒక ఫైర్ ఇంజిన్ అక్కడకు చేరుకోగా, రైతులు అడ్డుకున్నారు. మార్కెట్ కమిటీ ఆవరణలోని రెండు వాహనాలకు, ఫైర్ ఇంజిన్‌కు నిప్పు పెట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ఓ కానిస్టేబుల్ ఘటనాస్థలికి రాగా, అతడ్ని రైతులు వెంటబడి తరిమేస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరలైంది. కొన్ని గంటల తర్వాత పోలీసులు అతికష్టం మీద పరిస్థితిని అదుపులోకి తీసుకురాగలిగారు. మిర్చి పంట కొనుగోలు ధర ఒక్కసారిగా రూ.20 వేల నుంచి రూ.8 వేలకు పడిపోయిందని, రైతుల ఆగ్రహానికి ఇదే కారణమని హోంమంత్రి జీ పరమేశ్వర వివిధ రులకు చెప్పారు. ఈ ఘటనపై కర్ణాటక సీఎం సిద్దరామయ్య సంబంధిత అధికారుల నుంచి నివేదిక కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే బసవరాజ్ నీలప్ప మాట్లాడుతూ, 'మిర్చి కొనుగోలు ధర రూ.10 వేలకు పడిపోయింది. దీంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన రైతులే రాళ్లదాడికి పాల్పడ్డారు' అని అన్నారు.

## 40 ఏండ్లలో చూడని కరువు

- బెంగళూరులో బోర్ తవ్వకానికి అనుమతి తప్పనిసరి
- తమిళనాడుకు కావేరి జలాలు విడుదల చేయబోం
- కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, మార్చి 11: బెంగళూరులో నీటి కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోమవారం కీలక వ్యాఖ్యలు చేశారు. గత నాలుగు దశాబ్దాల్లో ఇలాంటి తీవ్రమైన కరువును రాష్ట్రం చూడలేదని పేర్కొన్నారు. రానున్న రెండు నెలలు చాలా కీలకమని.. అయితే బీజేపీ పేర్కొన్నట్టు పరిస్థితి ఎక్కువ తీవ్రంగా లేదన్నారు. బెంగళూరు నగర పరిధిలో అనధికార బోర్లు తవ్వేవారిపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. ఈ నెల 15 నుంచి బోర్లు తవ్వాలనుకొనేవారు తప్పనిసరిగా నీటి సరఫరా బోర్డు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసి అనుమతి పొందాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కావేరి జలాలను తమిళనాడుకు విడుదల చేసే ప్రసక్తే లేదన్నారు. ఇటీవల విడుదల చేసిన జలాలు బెంగళూరు నగర అవసరాల కోసమని స్పష్టం చేశారు. ట్యాంకర్ల రవాణాను, వాటి ధరలను పర్యవేక్షిస్తామని.. బెంగళూరు నగరాభివృద్ధి, రాష్ట్ర జల శాఖలు పర్యవేక్షిస్తున్న శివకుమార్ వెల్లడించారు. ప్రైవేట్ ట్యాంకర్లు ప్రభుత్వం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకొనే గడువును ఈ నెల 15 వరకు పొడిగించామని తెలిపారు. కేఆర్ఎస్ జలాశయం నుంచి తమిళనాడుకు కావేరి జలాలను విడుదల చేశారని సోమవారం మండ్య జిల్లా కేంద్రంలో రైతులు ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని 223 తాలూకాల్లో 196 తీవ్రమైన కరువుతో అల్లాడుతున్నాయి.

# గడువు పెంచేది లేదు

**ఎన్నికల బాండ్ల వెల్లడిపై ఎస్‌బీఐకి తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు**

- నేటి సాయంత్రంలోగా ఈసీకి వివరాలు అందించాలని స్పష్టీకరణ
- ఈ నెల 15న ఆ వివరాలను బయటపెట్టాలని ఈసీకి ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 11: భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ)కి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఎన్నికల బాండ్ల వివరాల వెల్లడికి అదనపు సమయం ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. బ్యాంకు తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ.. నేడు (మంగళవారం) సాయంత్రంలోగా కేంద్ర ఎన్నికల కమిషన్ (సీఈసీ)కి వివరాలు వెల్లడించాల్సిందేనని ఆదేశించింది. బ్యాంకు అందించిన వివరాలను ఈ నెల 15న సాయంత్రం 5 గంటలలోగా తమ అధికారిక వెబ్‌సైట్‌లో బహిర్గతపరచాలని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తాము నిర్దేశించిన గడువును, ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే.. గత నెల 15న తాము ఇచ్చిన తీర్పు పట్ల 'ఉద్దేశపూర్వకమైన అవిధేయత'గా పరిగణించి బ్యాంకుపై చర్య తీసుకోవడానికి వెనుకాడబోమని ఎస్‌బీఐని హెచ్చరించింది.

### ఉద్దేశపూర్వక అవిధేయత..

గత నెల 15న ఓ చారిత్రాత్మకమైన తీర్పును వెలువరించిన సుప్రీంకోర్టు.. రాజకీయ పార్టీలకు రహస్యంగా నిధులు సమకూర్చేందుకు వీలు కల్పించే ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన సంగతి తెలిసిందే. రాజకీయ పార్టీలకు రహస్యంగా నిధులు అందించడం 'రాజ్యాంగ విరుద్ధం' అని ప్రకటించిన న్యాయస్థానం.. ఆయా నిధులు ఇచ్చిన దాతల పేర్లను, వాటిని అందుకున్న పార్టీల వివరాలను ఈ నెల 6వ తేదీలోగా ఎన్నికల సంఘానికి తెలియపరచాలని ఆదేశించింది. బ్యాంకు అందించిన వివరాలను ఈ నెల 13లోగా ప్రజల ముందుంచాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తమ వద్దనున్న వివరాలను ఎన్నికల సంఘానికి అందజేసేందుకు మరింత గడువు కావాలని ఎస్‌బీఐ కోరింది. దాతలు, గ్రహీతల వివరాలను వేర్వేరుగా భద్రపరిచామని, వాటిని మ్యాచ్ చేసి వివరాలు అందించేందుకు సమయం పడుతుందని, తమకు జూన్ 30 వరకు గడువు కావాలని కోరింది. కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా ఎస్‌బీఐ ఉద్దేశపూర్వకంగా అవిధేయత చూపుతున్నదని, అందువల్ల బ్యాంకుపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని కోరుతూ మరిన్ని ప్రత్యేక పిటిషన్లు దాఖలయ్యాయి. వీటన్నింటిపై ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. తాము వెల్లడించాలని ఆదేశించిన సమాచారం ఎస్‌బీఐ వద్ద సిద్ధంగా ఉన్నట్టు అది దాఖలు చేసిన దరఖాస్తు ద్వారా తెలుస్తున్నదని, అందువల్ల గడువు కావాలన్న బ్యాంకు అభ్యర్థనను తోసిపుచ్చుతున్నామని కోర్టు స్పష్టం చేసింది.

### 12న బ్యాంకు పనివేళలు ముగిసేలోగా..

ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని తక్షణమే నిలిపివేయాలని ఎస్‌బీఐని ఆదేశించిన కోర్టు.. 2019, ఏప్రిల్ 12న పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు అమ్ముడుపోయిన బాండ్ల వివరాలను బయటపెట్టాలని పేర్కొంది. మార్చి 12న బ్యాంకు పనివేళలు ముగిసేలోగా ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎన్నికల కమిషన్‌కు అందించాల్సిందేనని స్పష్టం చేసింది. బ్యాంకు అందించిన సమాచారాన్ని క్రోడీకరించి, ఆ వివరాలను ఈ నెల 15న తమ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. కోర్టు ఆదేశాలను అమలు చేశామని ద్రువీకరిస్తూ ఎస్‌బీఐ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఒక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ఆదేశించింది.

### సుప్రీం తీర్పుపై విపక్షాల హర్షం

అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో స్విస్ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని వెలికితీస్తామని వాగ్దానం చేసి గద్దెనెక్కిన బీజేపీ.. తమ నిధుల రహస్యాలను దాచేందుకు అన్ని ప్రయత్నాలు చేసిందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. కేంద్ర ప్రభుత్వ కుతంత్రాల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు సుప్రీంకోర్టు ముందుకు మరోసారి వచ్చిందని కొనియాడింది. మోదీ ప్రభుత్వం అవినీతి, కుంభకోణాలు, అక్రమ లావాదేవీలు బయటపడటంలో ఇది తొలి అడుగు అని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఎన్నికల విరాళాల్లో పారదర్శకతను నెలకొల్పడంలో సుప్రీంకోర్టు తీర్పు కీలకమైన పరిణామమని సీపీఎం పేర్కొంది. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ.. బీజేపీకి నిధులు ఇచ్చిన వారి జాబితా బయటకు వస్తుందని, అయితే ఆ పేర్లను బయటపెడతారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మిగిలిందని అన్నారు.

### ఇంతవరకు ఏం చర్యలు తీసుకున్నారు?

ఎస్‌బీఐ తరపున సీనియర్ అడ్వకేట్ హరీశ్ సాల్వే తన వాదనలు వినిపిస్తూ.. బ్యాంకు వద్ద దాతలు, గ్రహీతల వివరాలను ఆయా శాఖల వద్ద వేర్వేరుగా ఉన్నాయని వాటిని క్రోడీకరించడానికి, సరిపోల్చడానికి ఎక్కువ సమయం పడుతుందని చెప్పారు. ఈ సరిపోల్చే ప్రక్రియను పక్కన పెట్టినా.. ఇతర ప్రక్రియను పూర్తి చేయడానికి కనీసం మూడు వారాల సమయం పడుతుందని అన్నారు. దీనిపై తీవ్రంగా స్పందించిన ధర్మాసనం.. 'ఏ దాత నుంచి ఏ గ్రహీత ఎంత తీసుకున్నారన్న వివరాలను మ్యాచ్ చేసి మేం చెప్పమనలేదు. ఎన్ని బాండ్లను జారీ చేశారన్న వివరాలను ఉన్నది ఉన్నట్టుగా ఈసీకి అందించాలని ఆదేశించాం. ఎస్‌బీఐ కేవలం తమ సీల్డ్ కవర్లను తెరిచి, వివరాలను క్రోడీకరించి, ఎన్నికల సంఘానికి అందజేయాలని మాత్రమే ఆదేశించాం' అని పేర్కొంది. గత నెల 15న తాము ఇచ్చిన తీర్పు అమలుకు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని కోరింది. 'గత 26 రోజులలో ఏం చేశారు? మీరు గడువు కోరుతూ సమర్పించిన దరఖాస్తులో దానికి సంబంధించిన ఎటువంటి వివరాలు లేవు' అని నిలదీసింది. దీనికి హరీశ్ సాల్వే సమాధానమిస్తూ.. కోర్టు తీర్పు అనంతరం ఎలక్టోరల్ బాండ్ల జారీని నిలిపివేశామని చెప్పారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత వైద్యం!

***రూ. 1.5 లక్షలు లేదా వారం పాటు నగదు రహిత చికిత్స***

*గోల్డెన్ అవర్ పేరిట కేంద్రం పథకం!*

*న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాద బాధితులకు గొప్ప ఉపశమనం కలగనుంది. బాధితులకు సకాలంలో చికిత్స అందించే ఉద్దేశంతో గోల్డెన్ అవర్ పేరుతో కేంద్రం కొత్త పథకం తీసుకొస్తున్నది. దీని ద్వారా రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత ఉచిత చికిత్స అందించనున్నది. హర్యానా, చండీగఢ్‌లో ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనుంది. అనంతరం దీనిని దేశ వ్యాప్తంగా అమలు చేయనున్నారు. ఇందుకోసం ఎంవీఏ చట్టం-2019కి సవరణలు చేయాలని కేంద్రం భావిస్తున్నది. కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ పథకం కింద రూ.1.5 లక్షలు లేదా 7 రోజుల దవాఖానలో చికిత్సలో ఏది తక్కువ ఖర్చయితే దాన్ని ఉచితంగా దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాద బాధితులకు కల్పించాలని కేంద్రం యోచిస్తున్నది. ప్రమాదం జరిగిన మొదటి గంట సమయాన్ని గోల్డెన్ అవర్‌గా పిలుస్తారు. ఈ టైమ్ లోగా సరైన చికిత్స అందితే ప్రాణాలు దక్కే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ కోసం సాధారణ బీమా కంపెనీలు 0.5 శాతం ధర్డ్ పార్టీ ప్రీమియం వితరణతో సుమారు రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయనున్నాయి.*

### 'బాలల అశ్లీల చిత్రాల డౌన్‌లోడింగ్ నేరం కాదా?'

**మద్రాస్ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు విస్మయం**

న్యూఢిల్లీ: బాలల అశ్లీల చిత్రాల (చైల్డ్ పోర్నోగ్రఫీ) డౌన్‌లోడింగ్‌ను నేరంగా పరిగణించరాదన్న మద్రాస్ హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీం కోర్టు తప్పుబట్టింది. ఈ కేసులో నిందితుడితో పాటు తమిళనాడు పోలీసులకు సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం నోటీసులు జారీచేసింది. ఎవరినీ ప్రభావితం చేయకుండా రహస్యంగా బాలల అశ్లీల చిత్రాలను డౌన్‌లోడ్ చేయడాన్ని, చూడటాన్ని పోక్సో చట్టం కింద గానీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం కింద గానీ నేరంగా పరిగణించలేమంటూ మద్రాస్ హైకోర్టు జనవరిలో సంచలనాత్మక తీర్పును వెలువరించింది. అశ్లీల ఫొటోలు, వీడియోలను ఇతరులకు పంపిణీ చేసేందుకు లేదా బహిరంగంగా ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తేనే నేరం అవుతుందని ఆ తీర్పులో పేర్కొంటూ.. చైల్డ్ పోర్నోగ్రఫీ కంటెంట్‌ను మొబైల్ ఫోన్‌లోకి డౌన్‌లోడ్ చేసినట్టు అభియోగాలను ఎదుర్కొంటున్న ఓ నిందితుడిపై విచారణను రద్దు చేసింది.

### 14న ఢిల్లీలో కిసాన్ మజ్దూర్ మహా పంచాయత్

న్యూఢిల్లీ: ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఈ నెల 14న కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్‌ను నిర్వహించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) తెలిపింది. దేశం నలుమూలల నుంచి, ముఖ్యంగా ఉత్తరాది నుంచి రైతులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పింది. చాలా కాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న రైతులు, కూలీల డిమాండ్లపై చర్చించనున్నట్లు వివరించింది. వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కల్పించడం, స్వామినాథన్ చెప్పిన సీ2 ప్లస్ 50 శాతం సూత్రాన్ని ఉపయోగించి ఎంఎస్‌పీని లెక్కించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### ఎన్నికల కమిషనర్ల నియామకంపై సుప్రీంకు కాంగ్రెస్

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘంలో కొత్త కమిషనర్ల నియామకం చేపట్టకుండా కేంద్రాన్ని నిలువరించాలంటూ కాంగ్రెస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సీఈసీ, ఈసీ నియామకాలపై మోదీ సర్కార్ 2023 డిసెంబర్‌లో తీసుకొచ్చిన చట్టాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీనిని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైనందున, దీని ఆధారంగా కేంద్రం కొత్త కమిషనర్ల నియామకం చేపట్టరాదంటూ పిటిషన్‌లో కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై వీలైనంత త్వరలో విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొన్నది.

### ట్రంప్ పరువు తీసిన ఆస్కార్ వ్యాఖ్యాత

న్యూఢిల్లీ: అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ తాజాగా ఆస్కార్ వేదికగా తన పరువు పోగొట్టుకున్నాడు. దీనికి ఆయన నోటిదురుసే కారణం. ఆస్కార్ కార్యక్రమ వ్యాఖ్యాత జిమ్మీని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్‌లో విమర్శించాడు. వేడుకలు జరుగుతున్న సమయానికి జిమ్మి దృష్టికి ఈ విషయం వచ్చింది. ఉత్తమ చిత్రం అవార్డును ప్రకటించే సమయంలో జిమ్మీ ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇప్పుడే తన పనితీరుపై ఓ సమీక్ష అందిందని ట్రంప్ పేరు చెప్పకుండా అతని పోస్ట్‌ను చదివి వినిపించాడు. కార్యక్రమాన్ని వీక్షించినందుకు ట్రంప్‌కు ధన్యవాదాలు తెలిపిన ఆయన.. 'ఇంకా మీ జైలు జీవితం ముగియలేదా' అని ప్రశ్నించాడు. దీంతో సభికులు ఒక్కసారిగా నవ్వారు.ట్రంప్ 4 కేసులు ఎదుర్కొంటున్నారు.

# అమల్లోకి సీఏఏ

మొదటిపేజీ తరువాయి...

నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన వారు భారత పౌరసత్వం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, దీని కోసం వెబ్ పోర్టల్‌ను కూడా సిద్ధం చేసినట్టు హోంమంత్రిత్వ శాఖకు చెందిన ప్రతినిధి ఒకరు తెలిపారు. విపక్షాల తీవ్ర నిరసనల మధ్య 2019 డిసెంబర్ 11న సీఏఏ బిల్లు-2019 పార్లమెంటు ఆమోదం పొందింది. దీనికి అప్పటి రాష్ట్రపతి కోవింద్ సమ్మతి కూడా లభించింది. అయితే, దేశవ్యాప్తంగా పౌరుల ఆందోళనలు, అలాగే చట్టంలోని పూర్తి నిబంధనలపై సందిగ్ధత నెలకొనడం వెరసి ఇప్పటివరకూ సీఏఏ అమలు కార్యరూపం దాల్చలేదు. కాగా లోక్‌సభ ఎన్నికల ముందే సీఏఏను అమల్లోకి తీసుకొస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల పలుమార్లు స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే కేంద్రం తాజాగా ఈ చట్టాన్ని నోటిఫై చేసింది. సీఏఏ నిబంధనలను కేంద్రం నోటిఫై చేయడంతో దేశ రాజధాని ఢిల్లీలోని సున్నిత ప్రాంతాల్లో పోలీసులను, పారా మిలిటరీ దళాలను భారీగా మోహరించారు.




### ఏమిటీ సీఏఏ?

మతపరమైన హింస కారణంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ నుంచి భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రిస్టియన్ మత స్తులకు భారత పౌరసత్వం ఇచ్చేందుకు సీఏఏను తీసుకొచ్చారు. శరణార్థుల దగ్గర సరైన ధ్రువపత్రాలు లేనప్పటికీ పౌరసత్వాన్ని ఇస్తారు. 2014, డిసెంబర్ 31 కంటే ముందు వచ్చిన వారు మాత్రమే పౌరసత్వానికి అర్హులు.

### అభ్యంతరాలు ఏమిటి?

1955 పౌరసత్వ చట్టాన్ని సవరిస్తూ తీసుకొచ్చిన కొత్త చట్టంలో ముస్లింలను మినహాయించడం వివాదానికి దారితీసింది. ఈశాన్య రాష్ట్రాల్లో పెద్దయెత్తున ఆందోళనలు జరిగాయి. ముస్లిం ఆధిపత్య దేశాల్లో మత హింస కారణంగా దేశంలోకి వలస వచ్చిన ముస్లిమేతరులకు ఈ పౌరసత్వ సవరణ చట్టం ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నది. అయితే ఈ చట్టం ముస్లింల పట్ల వివక్ష చూపుతున్నదని, రాజ్యాంగ లౌకిక సూత్రాలకు తూట్లు పొడుస్తున్నదని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

### చెలరేగిన మత ఘర్షణలు

సీఏఏకు ఆమోదం లభించిన తర్వాత తొలి ఏడాదిన్నర కాలంలో ఢిల్లీలోని షాహీన్‌బాగ్, అస్సాం గువాహటి సహా పలు ప్రాంతాల్లో ముస్లింలు పెద్దయెత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఆ తర్వాత మత ఘర్షణలు చెలరేగాయి. వంద మందికిపైగామరణించినట్టు నివేదికలు చెబుతున్నాయి. ఈ చట్టాన్ని అమలు చేసేది లేదని తమిళనాడు సీఎం స్టాలిన్, కేరళ సీఎం విజయన్ తెగేసి చెప్పారు.

### నాలుగేండ్లు పొడిగింపులు

సీఏఏకు రాష్ట్రపతి ఆమోదం లభించిన నాలుగేండ్లకు కేంద్రం తాజాగా దీన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అయితే, రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత ఏదైనా చట్టాన్ని ఆరునెల్లోగా నోటిఫై చేస్తూ కేంద్రం అమల్లోకి తీసుకురావాల్సి ఉంటుంది. సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళనలు చెలరేగడం, కరోనా, లాక్‌డౌన్ తదితర కారణాలతో సీఏఏ అమలుకు అవసరమైన నిబంధనలు ఏర్పాటుచేయడానికి మరింత సమయం పడుతుందంటూ పార్లమెంటరీ కమిటీ నుంచి కేంద్రం నిర్దిష్ట వ్యవధుల్లో ప్రత్యేక పొడిగింపు అనుమతులను తీసుకొన్నట్టు అధికారి ఒకరు తెలిపారు.

### కేరళలో అమలు చేయబోం!

ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించే సీఏఏను కేరళలో అమలు చేయబోం. ఈ చట్టాన్ని వ్యతిరేకించటానికి కేరళ ప్రజలంతా ఒక్క తాటిపైకి రావాలి.

**– విజయన్, కేరళ సీఎం**

### వివక్ష చూపితే వ్యతిరేకిస్తాం

పౌరసత్వ సవరణ చట్టంతో ప్రజలపై వివక్ష చూపినట్టయితే తప్పకుండా వ్యతిరేకిస్తా. లోక్‌సభ ఎన్నికల ముంగిట అశాంతిని నేను కోరుకోవడం లేదు. అసలే ఈశాన్య రాష్ట్రాల్లో పరిస్థితి సున్నితంగా ఉన్నది.

**– మమత, పశ్చిమ బెంగాల్ సీఎం**

### ఇది గాడ్సే ఆలోచనలో భాగం

పౌరసత్వ చట్టం విభజనతో కూడినది. ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చాలనే గాడ్సే భావనతో ఇది నిండినది. సీఏఏ కేవలం ముస్లింలను లక్ష్యంగా చేసుకోవటానికి ఉద్దేశించినది తప్ప మరెందుకు ఇది పనికి రాదు. మొదట ఎన్నికల సీజన్.. ఆ తర్వాత సీఏఏ నిబంధనలు.. ఈ వరుస క్రమాన్ని చూస్తేనే అసలు విషయం అర్థమవుతుంది. ఐదేళ్ల పాటు పెండింగ్ పెట్టి ఇప్పుడు సరిగ్గా ఎన్నికల ముంగిట దీన్ని ఎందుకు తెస్తున్నారో అర్థం చేసుకోండి. **– అసదుద్దీన్, ఎంఐఎం చీఫ్**



## భోజ్‌శాల మందిరమా? మసీదా?

**6 వారాల్లోగా సర్వేకు ఏఎస్ఐకి మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశం**

ఇండోర్, మార్చి 11: మధ్యప్రదేశ్‌లోని ధర్ జిల్లాలో ఉన్న భోజ్‌శాల మందిరమా? మసీదా? సర్వే చేసి చెప్పాలని భారత పురావస్తు సంస్థ (ఏఎస్ఐ)ని ఆ రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. 11వ శతాబ్దపు నాటిదిగా భావిస్తున్న ఈ నిర్మాణంపై 6 వారాల్లోగా శాస్త్రీయ సర్వే నిర్వహించి, నివేదిక అందించాలని స్పష్టం చేసింది. భోజ్‌శాలను హిందువులు సరస్వతీదేవికి అంకితం చేసిన దేవాలయంగా భావిస్తారని హిందీ ఫ్రంట్ ఫర్ జస్టిస్ సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. దీన్ని ముస్లింలు కమల్ మౌలా మసీదు అని పిలుస్తారు. అయితే, ప్రస్తుతం ఈ నిర్మాణం ఏఎస్ఐ పరిధిలో ఉన్నది. ప్రతి మంగళవారం హిందువులు, శుక్రవారం ముస్లింలు ప్రార్థనలు చేసుకొనేందుకు 2003లో ఏఎస్ఐ అనుమతి ఇచ్చింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హిందీ ఫ్రంట్ ఫర్ జస్టిస్ 2022లో పిల్ దాఖలు చేసింది. 1034లో అప్పటి ధర్ పాలకులు ఇక్కడ సరస్వతి విగ్రహాన్ని స్థాపించారని, 1857లో దాన్ని బ్రిటిష్‌వారు లండన్‌కు తీసుకెళ్లారని వాదించింది.

## మమత ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

*న్యూఢిల్లీ:పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో సోమవారం ఎదురు దెబ్బ తగిలింది. సందేశ్‌ఖాలీలో జనవరి 5న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఈడీ) అధికారులపై జరిగిన దాడి కేసులో దర్యాప్తు బాధ్యతలను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగిస్తూ కలకత్తా హైకోర్టు ఈ నెల 5న ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా హైకోర్టు చేసిన కొన్ని వ్యాఖ్యలను ధర్మాసనం తొలగించింది.*

## ఐదు నిమిషాల ధ్యానంతో మేధో వికాసం

*న్యూఢిల్లీ: కొన్ని నిమిషాల డీప్ మెడిటేషన్ వల్ల బోలెడు ప్రయోజనాలు లభిస్తాయని తాజా అధ్యయనం తేల్చింది. ఐదు నిమిషాల ధ్యానం.. అభ్యర్థన సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని చెప్పింది. మెడిటేషన్‌పై గతంలో అధ్యయనాలు జరిగినప్పటికీ స్వల్పకాలిక బుద్ధిపూర్వక ధ్యానం ఫలితాలు ఇస్తుందా? లేదా? అన్నదానిపై తాజాగా నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. మేధోజ్ఞానంపై అద్భుతమైన ప్రభావాన్ని చూపడంతోపాటు లోతుగా పాతుకుపోయిన సామాజిక పక్షపాతాలను సవరించగల సామర్థ్యం ధ్యానానికి ఉన్నట్టు వెల్లడైందని పరిశోధకులు తెలిపారు. ఐదు నిమిషాల ధ్యాన సెషన్‌లు కూడా గణనీయ ప్రభావాలను చూపగలవని తేలింది.*

## సారీ! అది ఎడిటెడ్ ఫొటో

*లండన్: మదర్స్ డేను పురస్కరించుకుని వేల్స్ యువరాణి కేట్ మిడిల్టన్ షేర్ చేసిన ఓ ఫొటో గందరగోళానికి కారణమైంది. అసలు వాస్తవాన్ని చెబుతూ క్షమాపణలు కోరారు కేట్. ఎక్స్ ఖాతా ద్వారా ఆమె స్పందించారు. తాను కూడా అందరు ఫొటోగ్రాఫర్ల వలే ఎడిటింగ్‌లో ప్రయోగాలు చేస్తున్నానని, తాము షేర్ చేసిన ఫొటో కూడా ఎడిటెడ్ అని, అందుకు క్షమాపణలు కోరుతున్నానని పేర్కొన్నారు. కేట్‌కు శస్త్ర చికిత్స జరిగిందని ప్రిన్స్ అండ్ ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ కార్యాలయం జనవరిలో తెలియచేసింది. అప్పటి నుంచి కేట్ బయట ఎవరికీ కనిపించలేదు. దీంతో ఎన్నో వదంతులు వ్యాపించాయి. ఈ నేపథ్యంలోనే కెన్సింగ్టన్ ప్యాలెస్ ఆదివారం ఓ ఫొటో విడుదల చేసింది.*

## రంగు పడింది!

**రంగులు వాడిన గోబీ మంచూరియా, కాటన్ క్యాండీపై కర్ణాటకలో నిషేధం**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): గోబీ మంచూరియా, కాటన్ క్యాండీ (పీచు మిఠాయి) విక్రయాలపై కర్ణాటక సర్కారు నిషేధం విధించింది. ఆకర్షణీయంగా కనిపించడానికి ఈ పదార్థాల్లో కృత్రిమ ఫుడ్ కలర్స్‌ను వాడుతుండటమే కారణంగా తెలిపింది. రంగుల కోసం ఉపయోగించే రోడమైన్-బి అనే రసాయనం క్యాన్సర్ వంటి ప్రమాదకర రోగాలకు కారణమవుతున్నదని, అలాంటి విష పదార్థాన్ని గోబీ మంచూరియా, కాటన్ క్యాండీల్లో యథేచ్ఛగా వినియోగిస్తున్నారని కర్ణాటక ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండురావు సోమవారం మీడియా భేటీతో వెల్లడించారు. 'ఆరోగ్యశాఖ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల పలు ఫుడ్ సెంటర్లు, 3-స్టార్ హోటల్స్ నుంచి 171 గోబీ మంచూరియా, 25 కాటన్ క్యాండీ నమూనాలను సేకరించారు.